క్లుప్తంగా

పదిలో మెరిసిన బీసీహాస్టల్ విద్యార్థులు


ఉత్తమ మార్కులు సాధించిన జగన్, వంశీని అభినందిస్తున్న వార్డెన్

సి.బెళగల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సి.బెళగల్ బీసీ హాస్టల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని వార్డెన్ రమేష్ తెలిపారు. గుండ్రేవుల గ్రామానికి చెందిన జగన్(మోడల్ స్కూల్) 569, అలువాల గ్రామానికి చెందిన వంశీ 568 మార్కులతో సత్తాచాటారన్నారు. మంగళవారం హాస్టల్ విద్యార్థులతో కలిసి వారికి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

ఘనంగా సుంకులా పరమేశ్వరిదేవి దేవర


సుంకులా పరమేశ్వరిదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్ గ్రామ దేవత సుంకులపరమేశ్వరిదేవి దేవర మంగళవారం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు కుంభం కాగులతో ఆలయానికి పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం


మూలపెద్దమ్మను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

గడివేముల: గడివేముల మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మామిడి రైతును ముంచిన ఈదురు గాలులు


నేలరాలిన కాయలను శుభ్రం చేస్తున్న రైతులు

పాణ్యం: మండలంలో ఈదురు గాలుల ధాటికి మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో వారంలో కాయలు దిగుబడికి వచ్చే తరుణంలో గాలులతో కాయలు నేలరాలాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. చేతికొచ్చే తరుణంలో ఇలా నెలపాలు కావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 35 హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారు.

28న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 28 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–15, అండర్– 19, సీనియర్స్ బాలికల క్రికెట్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. అండర్–15 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 సంవత్సరం సెప్టెంబర్ నెల 1 వ తేదీ నుంచి 2011 సంవత్సరం ఆగస్టు 31 వ తేదీ మధ్యన జన్మించి ఉండాలని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

వచ్చే నెల 1 నుంచి హాకీ సమ్మర్ క్యాంప్

కర్నూలు(టౌన్): వచ్చే నెల 1వ తేదీ నుంచి స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హాకీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌నకు కోచ్‌గా భరత్ వ్యవ హరిస్తారని తెలిపారు. వేసవి సెలవులను విద్యార్థినీ, విద్యార్థులు వృథా చేయకుండా ఉచితంగా నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో హాకీ మెలకువలను నేర్చుకుని క్రీడాకారులుగా రాణించాలని తెలిపారు. వివరాలకు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

- జగనన్నను గెలిపించుకుంటేనే భవిష్యత్తు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి


వెంకటగిరిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నేత గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు వారిపై పూలవర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత ఎన్నికలు పేదలు, పెత్తందారుల మధ్య జరుగుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే నాకు ఓటేయ్యమని అడిగే దమ్మున్న నేత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, వెంకటశివుడు, డీలర్ రాముడు, చిల్లబండ రాముడు, నాగేశ్వరరావు, మద్దిలేటి, గిరిబాబు, రామగిడ్డయ్య, అయ్యన్న, గిడ్డయ్య పాల్గొన్నారు.

దేవుడిలా ఆదుకున్నారు

వెంకటగిరికి చెందిన సాలమ్మ ఈనెల 6వ తేదీ ఊపిరితిత్తుల సమస్యతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లతో మాట్లాడారు. సాలమ్మకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. కోలుకున్న సాలమ్మ మంగళవారం ప్రచారం నిమిత్తం వెంకటగిరికి వచ్చిన సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. దేవుడిలా ఆదుకున్నారని కన్నీటి పర్యంతమైంది.

కోడుమూరులో జోరుగా ప్రచారం

కోడుమూరులోని వెంకటగిరి రోడ్డు, మాలవీధి, శాంతినగర్‌లో ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షాజిత్ ఆలీతో కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ భార్య స్టెల్లా సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, మగ్బుల్‌బాషా, కల్యాణ్, వీర, లింగమయ్య, లింగమూర్తి, శాశావలి, లింగన్న, రాఘవేంద్ర, సోమన్న, విష్ణుదాసు, కర్ణ, సుబ్బారావు, మాసుమ్ తదితరులు పాల్గొన్నారు.


హర్ష, సతీష్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధురాలు సాలమ్మ


కోడుమూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ దంపతులు

కేడీసీసీబీ సీఈఓ శివలీల సస్పెన్షన్


విజయకుమార్, సీఈఓ, డీసీసీబీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ శివలీలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కేడీసీసీ బ్యాంకులో జనరల్ మేనేజరైన శివలీల సీఈవోగా ఇన్‌చార్జీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందు 40 రోజుల పాటు సెలవుల్లో వెళ్లిన ఆమె ఇటీవల తిరిగి వచ్చారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయం జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి పోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాదానం ఇచ్చినప్పటికీ సంతృప్తికరంగా లేకపోవడంతో చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శివలీలను ఇన్‌చార్జ్ సీఈవో బాధ్యతల నుంచి తప్పించి ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తూ డీసీసీబీ పాలకవర్గం చైర్మన్ విజయమనోహరి చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేవు

- కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులేమి లేవని, ఇందుకోసం ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని పరిస్థితులను సీఎస్‌కు వివరించారు. మరో రెండు నెలలపాటు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కోవడానికి ప్రణాళికలు వేసుకున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కల్లా కల్యాణి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీదే విజయం

కర్నూలు(సిటీ): ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అడ్డుకోలేరని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీ అన్నారు. మంగళవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పూడూరు, పడిదెంపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు ఏనాడూ పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల గురించి పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ప్రభుత్వ సేవలను ఇంటి దగ్గరకే చేర్చేలా ప్రతి గ్రామంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, పేదల సొంతింటి కల సాకారం చేశారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. ఇంగ్లిష్ మీడియంతో పాటు డిజిటల్ విద్యను అందిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, నీటి సమస్యలు పరిష్కారించారని చెప్పారు. ఫ్యాను గుర్తుకు ఓటు చేసి సంక్షేమ పాలనను ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకుల ప్రలోభాలకు లొంగితే మళ్లీ జన్మభూమి కమిటీలు తీసుకొస్తారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నెహిమియ, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్, ప్రసాద్, వినయ్ కుమార్‌రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రామాంజనేయులు గౌడ్, కరుణాకర్ రెడ్డి, పూడూరు సర్పంచ్‌లు మహేష్, విద్యాసాగర్, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేష్ రెడ్డి, ఉల్చాల రామ్మోహన్ రెడ్డి, శేఖర్, మద్దిలేటి, చిన్నలక్ష్మన్న, ఇసాక్, యోసేపు, బీచుపల్లి, సురేష్, దామోదర్ నాయుడు, సంపత్, చక్రపాణిరెడ్డి, అఖిల్ రెడ్డి, మౌలాలి, మోహన్ బాబు, ఎదురూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

చంద్రబాబు మోసకారి

- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మోసకారి అని, తన స్వార్థ రాజకీయం కోసం మాయమాటలు చెబుతారని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 26, 27వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక వాటిని నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి టీడీపీ,బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ప్రజలను మోసం చేయడానకి వస్తున్నాయన్నారు. కూటమి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో 26, 27వ వార్డుల కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, పల్లె శారద, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడిని గెలిపించండి

ఓర్వకల్లు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని భైరాపురం, లొద్దిపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. నుదుటున కుంకుమ బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అనంతరం ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచ్‌లు గంగాధర్‌రెడ్డి, పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష, నాయకులు వి.ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజేశ్వరరెడ్డి, నాగేంద్రారెడ్డి, వీరభద్రారెడ్డి, ఉపసర్పంచ్ కిరణ్, వెంకటరాముడు, హనుమన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


లొద్దిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఉమామహేశ్వరమ్మ

కల్యాణ వైభోగం

- కనుల పండువగా కోన వెంకన్న కల్యాణోత్సవం
- ఫలహారాల బండ్లతో మొక్కులు చెల్లించిన భక్తులు


కల్యాణోత్సవం జరిపిస్తున్న పండితులు

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కోన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బుధవారం వేకువజామున స్వామివారి రథోత్సవం జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పెద్దనేలటూర్, పోలకల్, ఇనగండ్ల, సంగాల, కంబదహాల్, అలువాల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఎద్దుల బండ్లపై ఆలయానికి చేరుకుని ఫలహారాలను స్వామివారికి సమర్పించారు. ఈర్లదిన్నె గ్రామానికి చెందిన అట్ల ప్రతాప్‌రెడ్డి, అట్ల సరస్వతమ్మ దంపతులు భక్తులకు అన్నదానం, వసతి కల్పించారు. అంతకు ముందు స్వామివారి పల్లకీ సేవ నిర్వహించి ఉత్సవమూర్తులను కొండపై ఉన్న ఆలయానికి తీసుకొచ్చారు. మహాఘటాభిషేకం, పంచామృతాభిషేకం, సాయంత్రం రథాంగహోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కొండ దిగువకు చేర్చి మహా రథోత్సవానికి సిద్ధం చేశారు.


ఫలాహార బండ్లతో భక్తులు


స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేలంలో రూ.80 వేల ఆదాయం

గూడూరు: తిమ్మగురుడు స్వామి ఉత్సవాల్లో టెంకాయల విక్రయానికి మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.80 వేల ఆదాయం వచ్చినట్లు ఈఓ గుర్రెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలం పాటలో ఆరుగురు పాల్గొన్నారని చెప్పారు. సంగాల మధు రూ.80 వేలకు దక్కించుకున్నాడని తెలిపారు. గత ఏడాది రూ.92 వేల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.12 వేలు తగ్గినట్లు పేర్కొన్నారు. ఆలయ పర్యవేక్షకుడు మురళి, మున్సిపల్ కౌన్సిలర్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రెండు ఆవులు మృతి


పెసరవాయిలో మృతి చెందిన ఆవులు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గిత్త యుగంధర్ పాడి ఆవులు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటాయన్నారు. సంఘటన స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. రైతు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారం శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు.

ఓటే ఆయుధం

పాణ్యం: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని.. ఓటును అమ్ముకోవద్దని సెక్టోరల్ అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం భూపనపాడు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు.

28న 'మంచం మీద పెళ్లి' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు తెలిపారు. చిలకలూరి పేట మద్దుకూరి క్రియేషన్స్ వారిచే 'చింతామణి – భవాని ' నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

రమణీయం... రథోత్సవం



ఆంజనేయస్వామి మహా రథోత్సవం, చందన అలంకరణలో హనుమంతుడు

సి.బెళగల్: స్థానిక తెలుగు వీధిలో పడమటి ఆంజనేయస్వామి మహా రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అంతకుముందు వేద పండితుడు మధ్వాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పత్రపూజలు నిర్వహించారు. ఆలయంలో రథాంగ, రుద్ర హోమాలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. భక్తుల జై హనుమాన్, రామ నామస్మరణ నడుమ ఆలయం నుంచి కొత్త బస్టాండ్ ఈశ్వరగుడి వరకు ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు, కొబ్బరికాయలు సమర్పించారు.

టీడీపీ ప్రలోభాలను తిప్పికొట్టండి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న షన్మోహన్‌రెడ్డి

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బలవంతంగా తీసుకెళ్లి టీడీపీ కండువాలు కప్పుతూ ప్రలోభాలకు గురిచేస్తున్న టీడీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హుసేనాపురం గ్రామానికి చెందిన షన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత పనిపై కర్నూలుకు వెళ్లాడు. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు బలవంతంగా గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పి పార్టీలోకి చేరినట్లు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయాన్ని గమనించిన సన్మోహన్‌రెడ్డి సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జీకే వెంగన్న, గుర్రాల చెన్నారెడ్డి ఆధ్వర్యంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేశారు. తాను మొదటి నుంచి కాటసాని రాంభూపాల్‌రెడ్డి వీరాభిమాని అని షన్మోష్‌రెడ్డి తెలిపాడు.

టీడీపీ నాయకుడి అరాచకం

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి పరమేశ్వరరెడ్డి, అతని కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పెరుమాళ్ల చంద్రశేఖర రెడ్డి సోమవారం రాత్రి దాడికి తెగబడ్డాడు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, అల్లుడు ఏసేపు పాతకక్షలు మనసులో పెట్టుకుని పరమేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి వీరంగం సృష్టించాడు. పరమేశ్వరరెడ్డి కుమారుడు సాయికుమార్‌రెడ్డిపై దాడి చేస్తుండగా తల్లి జయలక్ష్మి అడ్డుకోవడానికి వచ్చింది. ఆమెపై కూడా విచక్షణారహితంగా దాడి చేసి నానా దుర్భాషలాడాడు. గాయాలు కావడంతో బంధువులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరస్పరం ఫిర్యాదుతో మంగళవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బట్ట కాల్చి మొహంపై వేయటం సమంజసమా?

టీడీపీ నాయకుల వ్యవహార శైలి బట్ట కాల్చి మొహం మీద వేసినట్లుగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, దుర్వేశి వైఎస్సార్‌సీపీ నాయకుడు బండపల్లి రమేష్ మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. దుర్వేశి గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించి టీడీపీ నాయకుల వ్యవహార శైలిపై దుమ్మెత్తిపోశారు. గ్రామంలో టీడీపీకి ఆదరణ లభించడం లేదనే అక్కసుతో లేనిపోని డ్రామాలకు తెరతీయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సోమవారం తెదేపా అభ్యర్థి గౌరు చరితా రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పెరుమాళ్ల చంద్రశేఖర్ కావాలనే వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటి దగ్గరకు వెళ్లి దుర్భాషలాడి, సవాల్ చేయడం, వారి కుటుంబ సభ్యులను గాయపరచడం దుర్మార్గమన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఏదైనా ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి.. ఇలాంటి నాటకాలకు వైఎఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లొంగరన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం రేడియో స్టేషన్ ఫీడర్, బాబా బృందావన్ నగర్ ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. తులసీ నగర్, పద్మారైస్ మిల్, వీకర్ సెక్షన్ కాలనీ, మల్లారెడ్డి రిచ్‌మండ్ విల్లాస్, గీతాంజలి వెంచర్,రేడియో స్టేషన్, వెంకయ్య నగర్, బాబా బృందావన్ నగర్, గోపీ నగర్, నిర్మలానగర్, రాజీవ్ నగర్, టీవీఎస్ షోరూం , యమహా షోరూం ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓల్డ్ టౌన్ సెక్షన్ పరిధిలోని ఒకటో పోలీస్ స్టేషన్ ఏరియా, రాంబొట్ల దేవాలయం, కుమ్మరి వీధి, ఓల్డ్ టౌన్ ఏరియా, చిత్తారి స్ట్రీట్ ఏరియాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.